క్లుప్తంగా

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే


శివాజీపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వేను జోరుగా నిర్వహిస్తున్నారు. వార్డుల్లోని సచివాలయాల పరిధిలో వలంటీర్లు సర్వే చేసి, అర్బన్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. అనంతరం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య సూపర్‌వైజర్ నేతృత్వంలో సచివాలయ ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఇంటింటికి వెళ్లి ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. బుధవారం 20, 22 వార్డుల పరిధిలో ఆరోగ్య కార్యకర్త ఆర్.ఎ.ఆచారి, ఆశ, నర్సింగ్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు.

పెరిగిన విద్యుత్ చార్జీలతో ఆర్థిక భారం


దుర్గానగర్‌లో మహిళకు కరపత్రాలు అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: విద్యుత్ చార్జీలు పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని సీపీఐ ఆరిలోవ జోన్ నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం నిరసన తెలుపుతూ ఆరిలోవ ప్రాంతం దుర్గానగర్, పార్వతీనగర్, సుందరయ్య కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరెంట్ చార్జీలు విపరీతంగా పెంచేస్తున్నాయని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెహ్మాన్, లక్ష్మణరావు, దేవుడమ్మ, పుష్పలత పాల్గొన్నారు.

దేవీ ఉత్సవాలకు పందిరి రాట


సింహగిరి కాలనీలో దుర్గాదేవి రాట వేస్తున్న స్థానికులు

ఆరిలోవ: పెదగదిలి ప్రాంతం కొండవాలు సింహగిరి కాలనీలో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో విజయ దుర్గాదేవి నవరాత్రి వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దూలి రఘు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అలరించిన సంగీత గాత్ర కచేరి


గాత్ర కచేరి చేస్తున్న శృతిరవళి

మద్దిలపాలెం : విశాఖ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి నెలా కార్యక్రమంలో భాగంగా బుధవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గాత్ర కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీఎండీఏ ప్రతినిధులు డాక్టర్ వీఆర్‌కే రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ప్రముఖ గాయని వంకా శృతి రవళి పలు కీర్తనలు ఆలపించి అలరించారు. వయోలిన్‌పై నీలాద్రి, మృదంగంపై ధన్వాడి ధర్మారావు, మోర్సింగ్‌పై వెంకటేష్ చక్కటి వాయిద్య సహకారం అందించారు.

పుస్తక వైద్యులు



పుస్తకాలు బైండింగ్ చేస్తున్న సిబ్బంది


దారానికి తేనె మైనం రాస్తున్న ఉద్యోగి

- ఏయూలో విశేష సేవలందిస్తున్న బైండింగ్ విభాగం
- ప్రతి పుస్తకాన్ని భద్రపరచడంలో కీలక పాత్ర


ఏయూ గ్రంథాలయంలో మరమ్మతులు చేపట్టనున్న పుస్తకాలు

ఏయూ క్యాంపస్: ప్రతి పుస్తకం వారికి తమ పిల్లలతో సమానం. పిల్లలకు దెబ్బతగిలితే ఎలా వైద్యం చేయిస్తామో.. పుస్తకం చిరిగితే అదే రీతిలో స్పందించి మరమ్మతులు చేపట్టి భద్రపరచడం ఏయూ గ్రంథాలయంలో నిత్యకృత్యంగా సాగుతోంది. నిత్యం పదుల సంఖ్యలో పుస్తకాలకు మరమ్మతులు చేసి కొత్తవాటిలా తీర్చిదిద్దడానికి వర్సిటీ బైండింగ్ విభాగ సిబ్బంది పరితపిస్తుంటారు. ప్రతి పుస్తకం ఎంతో విలువైన జ్ఞానాన్ని అందిస్తుందనే భావనతో మరమ్మతులు పూర్తి చేసి తిరిగి గ్రంథాలయానికి అందిస్తున్నారు. అందుకే వారిని ఏయూలో పుస్తక వైద్యులుగా పిలుస్తున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాయంలో ప్రత్యేక బైండింగ్ విభాగం ఉంది. గ్రంథాలయం ఏర్పాటైనప్పటి నుంచి ప్రత్యేకంగా పుస్తకాలకు బైండింగ్ చేయడానికి ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు గ్రంథాలయంలో 5,40,728 పుస్తకాలు ఉన్నాయి. వీటన్నింటినీ కంటికి రెప్పలా కాపాడుతూ అవసరమైన మరమ్మతులు చేస్తుంటారు.

కొత్త పుస్తకానికీ బైండింగ్

గ్రంథాలయానికి ఏ కొత్త పుస్తకం కొన్నా ముందుగా బైండింగ్ విభాగానికి చేరుతుంది. ఆ పుస్తకం దీర్ఘ కాలం మన్నేలా కార్డ్‌బోర్డ్‌తో ప్రత్యేకంగా బైండింగ్ చేస్తారు. అనంతరం పుస్తకానికి ఒక ప్రత్యేకమైన నంబరుని కేటాయిస్తారు. ప్రత్యేకమైన దారానికి తేనె, మైనం రాసి పుస్తకాన్ని కుడతారు. దీంతో పుస్తకం దీర్ఘకాలం మన్నుతుంది. ఇందు కోసం మూడు దశల్లో పని చేస్తారు. దశాబ్దాల అనుభవం కలిగిన 8 మంది సిబ్బంది ఈ విభాగంలో ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. ముందుగా ఛిద్రమైన, దెబ్బతిన్న పుస్తకం తమ వద్దకు వచ్చినప్పుడు దానిని ఓపెన్ చేసి సరిచేస్తారు. అనంతరం దృఢమైన కార్డ్‌బోర్డ్‌తో రెండు వైపులా అట్ట వేసి, అతికిస్తారు. బాగా ఆరిన తరువాత పుస్తకానికి మూడు ప్రాంతాలలో కన్నాలు పెట్టి, ప్రత్యేకమైన దారంతో కుడతారు. వీటితో పాటు లెదర్ బైండర్, జర్నల్ బైండర్, సాధారణ బైండింగ్ చేస్తుంటారు. పలు సందర్భాలలో పుస్తకాలకు రేపర్ బైండింగ్ కూడా ఇక్కడ చేస్తారు.

మూడు దశాబ్దాలుగా పని చేస్తున్నా..



గ్రంథాలయానికి వచ్చే ప్రతి కొత్త పుస్తకం మా వద్దకు వస్తుంది. దీని పటిష్టతకు బైండింగ్ చేస్తాం. అదే విధంగా పాడైన పుస్తకాలను సరిచేసి, అవసరమైతే మళ్లీ బైండింగ్ చేస్తాం. సాధ్యమైనంత వరకు పూర్వ స్థితిని తీసుకురావడానికి కృషి చేస్తాం.

– ఎస్.రంగనాయకులు, బైండర్, ఏయూ గ్రంథాలయం

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం..



గ్రంథాలయంలో ప్రధాన అంగాలలో బైండింగ్ విభాగం ఒకటి. దీనిలో నిబద్ధతతో పనిచేసే సిబ్బంది ఉన్నారు. వారికి కాలానుగుణంగా అవసరమైన కొన్ని ఉపకరణాలు కొనుగోలు చేసి అందిస్తున్నాం. శారీరక శ్రమను తగ్గిస్తూ త్వరితగతిన సేవలు అందించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాం.

– ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఏయూ లైబ్రేరియన్

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

- ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


సుందర్‌నగర్‌లో వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: పేదల ఆర్థిక అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ పదో వార్డులో మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి సుందర్‌నగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏ కుటుంబానికి ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందో సచివాలయం సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఎంవీవీ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచంద్ర, నగర కార్యదర్శి చొక్కర శేఖర్, అయ్యారెకల కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు, పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాస్, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు జగ్గుపల్లి జయ, బసవయ్య, పతివాడ కనకరాజు, కె.వి చలం, ఒమ్మి శ్రీను, శ్రీనివాసరావు, ఆనందరావు, వరలక్ష్మి, కనక లక్ష్మి, ముద్దం కృష్ణ, ఒమ్మి వెంకటరావు, కార్యకర్త లు, సచివాలయం కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవల్లో మేటి వానప్రస్థ వృద్ధాశ్రమం

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి


ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న స్వరూపానందేంద్ర స్వామీజీ

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తి తూచా తప్పకుండా అమలు చేస్తూ సామాజిక సేవలో మేటిగా వానప్రస్థ వృద్ధాశ్రమం నిలుస్తోందని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి అన్నారు. 49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లోని వానప్రస్థ వృద్ధాశ్రమం బుధవారం నిర్వహించిన 12వ వార్షికోత్సవంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్ వృద్ధులకు చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సనాతన హిందూ ధర్మంలో పూజాధికాలతోపాటు దీనులు, అభాగ్యులను ఆదుకోవడానికి కూడా అత్యంత ప్రాధాన్యముందని పేర్కొన్నారు. పురాణాలు, వేదాల్లో ఈ ప్రస్తావన ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వృద్ధాశ్రమాల అవసరం ఎంతో ఉందని సూచించారు. నిరాదరణకు గురైన తల్లిదండ్రులను అక్కున చేర్చుకుని సేవలందించడం గొప్ప విషయమని, యువతరం వానప్రస్థ వృద్ధాశ్రమ సేవలను ఆదర్శంగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఆశ్రమం 25 వసంతాలు పూర్తి చేసుకుని సేవలను మరింతగా విస్తరించాలని స్వామి ఆకాంక్షించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి నిర్వాహకుడు శ్రీనివాస్‌ను అభినందించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఎస్వీ జోగారావు


మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట: కవిగా, కథకుడిగా, నాటక రచయితగా, వ్యాసకర్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, సంపాదకుడిగా బహుముఖ ప్రజ్ఞతో ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించిన సాహితీ సంపన్నుడు ఆచార్య ఎస్వీ జోగారావు అని ఆచార్య వెలమల సిమ్మన్న కొనియాడారు. జోగారావు 92వ జయంతి సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో ఆయన సాహితీ ప్రసంగం చేశారు. జోగారావు చేసిన వచన కవిత్వం కమనీయంగా ఉంటుందని, సంప్రదాయ, ఆధునిక కవిత్వాల్లో అందెవేసిన చెయ్యని పేర్కొన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకరరావు మాట్లాడుతూ జోగారావు రాసిన యక్షగాన వాఙ్మయ చరిత్ర ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. దాస భారతీయ ప్రచురణ సంస్థ ఏర్పాటు చేసి తెలుగులో దాస సాహిత్యంపై ఎన్నోగ్రంథాలు ప్రచురించారన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకుడిగా ఎందరో సాహితీవేత్తలను తయారు చేసిన ఉత్తమ ఆచార్యుడు ఎస్వీ జోగారావు అని ప్రశంసించారు. సాహితీవేత్తలు కె.జి.వేణు, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కె.వి.ఎస్.మూర్తి, రామతాత, కుప్పిలి భీమేశ్వరరావు, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

డాక్టర్ అపరంజికి అభినందన


డాక్టర్ అపరంజిని అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ఇమ్యుకాన్–2023 సదస్సులో పాల్గొన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ పి.అపరంజిని వర్సిటీ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యక్రమంలో అభినందించారు. సదస్సు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇండియన్ ఇమ్యునాలజీ సొసైటీ గోల్డెన్ జూబ్లీ సమావేశంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అపరంజి ఒక సైంటిఫిక్ సెషన్‌కు చైర్‌పర్సన్ కూడా వ్యవహరించారు. ఇమ్యునాలజీ రంగంలో చేస్తున్న సేవలను గుర్తిస్తూ సదస్సు నిర్వాహకులు డాక్టర్ అపరంజిని సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

బాలిక దినోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ హరనాథ్, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆడ పిల్లలను రక్షిద్దాం.. అండగా నిలబడదాం.. నినాదంతో అంతర్ జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన వాల్ పోస్టర్‌ను బుధవారం ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్ ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ హరనాథ్ మాట్లాడుతూ సృష్టికి ప్రతి రూపమైన మహిళా మూర్తిని గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నరవ ప్రకాశరావు, విభాగ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయాలి

- డిప్యూటీ మేయర్ శ్రీధర్



విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎకో వైజాగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 52వ వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో మిద్దెతోటల పెంపకానికి అవసరమైన సామగ్రి పంపిణీ చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. దీని కోసం మర్రిపాలెం ఉడా లేఅవుట్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇంటిపై కప్పుపై సేంద్రియ వ్యవసాయం చేసేవారికి దేశీయ కూరగాయల మొక్కలు, పిచ్చుకలు, పక్షులకు నీళ్లు ఆహారం పెట్టేందుకు గూళ్లు వంటివి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు బుధవారం ఈవో కొండబాబు డ్రా తీసి, రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు వారికి వచ్చిన స్టాల్‌లో వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు


గర్ల్ అప్ ప్రారంభంలో ప్రిన్సిపాల్స్, ఆచార్యులు

ఏయూ క్యాంపస్: విద్యతోనే మహిళా సాధికారత సాకారం అవుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. బుధవారం ఏయూ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విభిన్న రంగాలలో మహిళలు రాణించాలని సూచించారు. కేంద్ర సంచాలకురాలు డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ లింగ వివక్షత, అసమానతలు పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలకు తమ హక్కులపై చైతన్యం, అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కె.సలోమి, జి.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

గర్ల్ అప్ ప్రారంభం

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే విధంగా గర్ల్ అప్ కార్యక్రమాన్ని బుధవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వర్సిటీ ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు, ఆచార్యులు ప్రారంభించారు. గర్ల్ అప్ క్యాంపెయిన్‌కు 2010లో యునైటెడ్ నేషన్స్ ఫౌండేషన్ శ్రీకారం చుట్టింది. 120 దేశాలలో 3500కి పైగా క్లబ్‌లు ప్రస్తుతం ఉన్నాయి. బాలికల అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమాన అవకాశాలు, విద్య, హక్కులు, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక అవకాశాలు తదితర అంశాలపై వీరంతా పని చేస్తారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రిన్సిపాల్స్ ఆచార్య వి.వి జయలక్ష్మి, ఆచార్య టి.శోభశ్రీ, పాలక మండలి సభ్యులు ఆచార్య దుర్గారాణి, ఆచార్య పి.సునీత, ఆచార్య ఏకేఎం పవార్, ఆచార్య కె.సీతామాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో విజేతకు మేయర్ అభినందనలు


సాయిదీప్తిని అభినందిస్తున్న మేయర్

ఆరిలోవ: తైక్వాండో పోటీల్లో ఆరిలోవ ప్రాంతానికి చెందిన సాయిదీప్తి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు సాయి దీప్తిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం అభినందించారు. సాయిదీప్తి ఆరిలోవలో సెయింట్ ఆన్స్ స్కూల్‌లోని తైక్వాండోలో శిక్షణ పొందుతుంది. ఈ నెల 7న గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో తైక్వాండో అండర్–40 కేజీల విభాగంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సాయిదీప్తి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపాలని, వారికి తల్లిదండ్రులు ప్రోత్సాహం ఉండాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, తైక్వాండో కోచ్‌లు పాల్గొన్నారు.

మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందన


విజయచందర్‌కు అభినందనలు తెలుపుతున్న శంకర్, తదితరులు

ఎంవీపీ కాలనీ: మత్స్యకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా ఇటీవల నియమితులైన పేర్ల విజయచందర్‌కు 18వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. విజయచందర్‌ను బుధవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా 18వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పుక్కళ్ల శంకర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మత్స్యకారులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. పథకాలతో పాటు రాజకీయంగాను మత్స్యకారులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసుపల్లి ఎల్లాజీ, వాసుపల్లి వెంకటపతిరాజు, వీరాబాబు, రాజేష్, చంటి, రాజు, ధనలక్ష్మి, జ్యోతి, రెడ్డికమ్మ, దాసు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన


సుప్ర వాహనంపై ప్రమాదాల గురించి డిజిటల్ టెలిఫిల్మ్ ప్రదర్శన

మద్దిలపాలెం : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం నగర పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కూడళ్లలో సుప్ర వాహనంపై డిజిటల్ ఫిల్మ్ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. దీనిలోభాగంగా బుధవారం మద్దిలపాలెంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరుగుతున్న తీరును కళ్లకట్టినట్టు చూపిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలను వీక్షించడం ద్వారా ప్రమాదాల నుంచి ఎలా రక్షణ పొందాలనేది అవగాహన కలుగుతుందన్నారు. సురక్షిత ప్రయాణానికి వాహనచోదకులు ప్రాధా న్యం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కనకరాజు, సిబ్బంది నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ముగిసిన క్యాంప్


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేర్‌లో సోమవారం ప్రారంభమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఉదయం సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం ఫ్లాగ్ బ్రేక్, రాత పరీక్ష, లాగ్ బుక్స్ తనిఖీలు నిర్వహించారు. 11 స్కూళ్ల నుంచి పాల్గొన్న సుమారు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్ కలిగి ఉండవలసిన క్రమశిక్షణ, చురుకైన భాగస్వామ్యం ప్రతీ ఒక్కరూ కలిగి ఉన్నారని ప్రశంసించారు. చివరిగా స్కౌట్ అండ్ గైడ్ పతాకం అవనతం చేశారు. క్యాంప్‌లో పాల్గొన్న వారందరికీ ఆయన ప్రశంసాపత్రాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. అలుమ్ని సభ్యులు విజయ్‌భాస్కర్, సూర్య, స్కూల్ హెచ్ఎం శైలజ, సిబ్బంది రేఖ మిట్టపల్లి, విజయలక్ష్మి, ప్రభాకర్, కామేశ్వరరావు, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.